క్లుప్తంగా

పూజితకు పలువురి అభినందనలు



పూజితను అభినందిస్తున్న కృష్ణారెడ్డి

కలువాయి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితని నగరంలోని కాకాణి స్వగృహంలో ఆదివారం కలువాయి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మాకిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, కలువాయి మాజీ సొసైటీ అధ్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్ : వినాయక చవితి పండగ పురస్కరించుకుని ఉత్సవాలకు లోకల్ పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు నిర్వాహకులు ముందస్తు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో దైవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. ఆ కార్యక్రమాలు పూర్తి బాధ్యత కమిటీ వారిదేనని తెలియజేశారు. ఊరేగింపు, నిమజ్జన సమయంలో ఎవరైనా మద్యం తాగి ప్రజాశాంతికి భగ్నం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు ఊరేగింపు, వాహనం, డ్రైవర్ల వివరాలను ముందస్తుగా పోలీసులకు అందజేయాలని తెలియజేశారు. వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆన్‌కాల్ డ్రైవర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఆర్టీసీ డిపో ఆన్‌కాల్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి 18 నెలలు హెవీ వాహనం అనుభవం కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ అమల్లో ఉండి 55 ఏళ్ల ఉండాలని మెడికల్ అధికారి వద్ద ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఆసక్తి ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డిపో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పత్రాలు లేని ఐదు బైక్‌ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

చిల్లకూరు: గూడూరు రెండవ పట్టణ పరిధిలోని టిడ్కో ఇళ్ల ప్రాంతంలో ఆదివారం రూరల్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్ల వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేని ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల టిడ్కో ఇళ్లలో పలు ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు అద్దెకు ఉంటున్నట్లు తెలుస్తోందని, అయితే వీరిలో కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు తెర తీస్తున్నారని దీని వల్ల అందరికీ ఇబ్బంది కలుగుతుందని అన్నారు. ఈ ప్రాంతంలోకి వచ్చే కొత్త వ్యక్తులు, కుటుంబాల వారి వివరాలను తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

రసవత్తరంగా పాటల పోటీలు



పాటల పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న గాయకులతో నిర్వాహకులు

చిల్లకూరు: మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు (ఈ నెల 22వ తేదీ) సందర్భంగా వారం రోజుల పాటు చిరంజీవి అభిమానులు చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా బ్రదర్స్ సేవాసమితి, అఖిల భారత చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మెగా పాటల(క్వార్టర్ ఫైనల్స్) పోటీలను నిర్వహించారు. గూడూరులోని వీరభద్ర స్వామి గుడికి ఎదురుగా ఉన్న ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ పాటల పోటీల్లో పలు ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్, పాడుతా తీయగా గాయని సుగంధని, సారంగం సులక్ష్మి, సీనియర్ జర్నలిస్టు ఇస్కపల్లి శివప్రసాద్, కొత్తపల్లి వసంతకుమార్, పగడాల మురళి, కొట్టే వెంకటేశ్వర్లు, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, శ్యామ్, మోహన్, భాస్కర్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నందిమాల గ్రామంలో ట్యాంకర్ వద్ద జనం అవస్థలు



పొలాల నుంచి బిందెలతో తాగునీరు తీసుకెళుతున్న మహిళలు

దాహంతో అల్లాడుతున్న జనం

- 14 గ్రామాల ప్రజలు విలవిల
- మంచినీటి పథకానికి గ్రహణం
- 27 ఏళ్లుగా ఒక్కరికే నిర్వహణ బాధ్యత
- ఏడాదికి రూ.4 లక్షల ఖర్చు

పెళ్లకూరు: దాహంతో పల్లె జనం విలవిల్లాడిపోతున్నారు. ఒకటి రెండు కాదు ఏకంగా 14 గ్రామాల ప్రజలు తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. దీనికి కారణం మంచినీటి పథకం నిర్వహణ అటకెక్కడమే. సుదూరంలోని మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాజీవ్‌టెక్నాలజీ మంచినీటి పథకానికి గ్రహణం పట్టింది. తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీనికి కారణం 27 ఏళ్లుగా ఓ పెత్తందారుడికి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమే. అసలు నీరు సరఫరా చేయకపోయినా యేడాదికి రూ.4 నుంచి రూ. 5లక్షలు నిర్వహణకు ఖర్చు చేసినట్లు సంబంధిత శాఖ రికార్డులు చెబుతున్నాయి.

మండలంలోని రోసనూరు, రాజుపాళెం, కిష్టప్పకండ్రిగ, కానూరు, పెన్నేపల్లి, బంగారంపేట, మోదుగులపాళెం, నందిమాల తదితర 14 గ్రామాలకు స్వర్ణముఖినది నుంచి తాగునీరు అందించేందుకు 1998లో రూ.1.8 కోట్ల నిధులతో రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు.





రాజీవ్‌టెక్నాలజీ మంచినీటి పథకం, మోదుగులపాళెంలో బావి నుంచి తాగునీరు తోడుకుంటున్న స్థానికులు

చెంబడిపాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖిన దిలో మోటార్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైపులైన్లతో మండలంలోని 14 గ్రామాలకు తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పథకం నిర్వహణకు ఏడాదికి రూ.4లక్షల నుంచి రూ.5లక్షలు, విద్యుత్ చార్జీలకు మరో రూ.7లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పథకం తొలి దశలో అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేసిన నిర్వాహకులు గత కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో పల్లె జనులు దాహార్తితో అలమటిస్తున్నారు.

బావినీరే శరణ్యం

రాజీవ్‌టెక్నాలజీ తాగునీటి పథకం కింద మారుమూల గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు ఆర్భాటం చేస్తున్నారు. అయితే మోదుగులపాళెం గ్రామానికి దశాబ్దాలుగా మంచినీరు సరఫరా నిలిచిపోవడంతో అక్కడి ప్రజలకు బావి నీరే శరణ్యమైంది. పైపులైన్ పలుచోట్ల మరమ్మతులకు గురి కావడం, బాధ్యత లేని నిర్వహణతో తాగునీరు పూర్తిగా నిలిచిపోయింది. నందిమాల, ఊడిపూడి, రోసనూరు, రాజుపాళెం గ్రామాలకు కూడా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఎక్కువ మంది ప్రజలు ప్రతి రోజు రూ.15 చొప్పున వాటర్ క్యాన్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరికొన్ని చోట్ల చాగణం ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే వాటర్ ట్యాంక్‌లను వినియోగించుకుంటున్నారు. చాలా కాలంగా నిర్వహణ బాధ్యతలు ఒక్కరికే అప్పగించడం, వారు పట్టించుకోకపోవడంతో దూర ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది.

దశాబ్దాలుగా శాసిస్తున్న నిర్వాహకుడు

రాజీవ్ టెక్నాలజీ తాగునీటి పథకం నిర్వహణ బాధ్యతలను గత 27 యేళ్లుగా అధికార పార్టీకి చెందిన నాయకుడే నిర్వహిస్తున్నారు. రోసనూరు గ్రామానికి చెందిన ఆయన ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారినప్పుడల్లా పార్టీ మారుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంచినీ పథకాన్ని గుప్పిట్లో పెట్టుకున్నారు. అందువల్ల ఉన్నత స్థాయి అధికారులను శాసిస్తూ మారుమూల గ్రామాలకు నీరందించాలనే లక్ష్యాన్ని నీరుగారుస్తున్నాడు. పైపులైన్, విద్యుత్ మోటార్లు పలుమార్లు మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం మరో విశేషం. ఏటా నిర్వహణ నిధులకు సరిపడా లెక్కలు మాత్రం కాగితాల్లో సిద్ధంగా ఉంటాయి. సకాలంలో నిధులు ఖాతాలకు జమవుతాయి.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల వల్ల తాగునీటి పైపులైన్ పలుచోట్ల మరమ్మతులకు గురైంది. గత కొన్ని రోజులుగా మరమ్మతు పనులు చేస్తున్నాము. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరింలా చర్యలు చేపడతాం.

– చంద్రశేఖర్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

చికెన్ ధరలు		11.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	112
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	208
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	230
లేయర్ చికెన్	:	195

నేడు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలియజేశారు. గత నెల 31న నిర్వహించాల్సిన మున్సిపల్ అత్యవసర సమావేశం వాయిదా వేసిన సంగతి తెలిసిందేనన్నారు. ఆ సమావేశంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాస్

గూడూరురూరల్ : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాత నేరస్తులు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు పాల్పడినా వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాతనేరస్తులు సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, పార్టీ నాయకులు

నాయుడుపేటటౌన్: ఉపాధ్యాయులు పాలచ్చూరు రవి కుమార్తె కిరణ్ వైష్ణవి, రాకేష్ వివాహ రిసెప్షన్ వేడుకల్లో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వాదాలు అందించారు. సంజీవయ్యతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నాయకులు గంధవల్లి సిద్దయ్య, దొంతాల రాజశేఖర్ రెడ్డి, జెట్టి వేణు యాదవ్, షేక్ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

కాకాణి పూజితకు అభినందనలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అభినందించారు. నెల్లూరులోని అమె నివాసం వద్దకు వెళ్లి పూజితకు పుష్పగుచ్ఛం అందించి సంజీవయ్య అభినందలు తెలిపారు. ఆయనతోపాటు నాయుడుపేట ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కురుగొండ ధనలక్ష్మి, సూళ్లూరుపేట నియోజవర్గ మహిళ విభాగ కన్వీనర్ ఈదా రత్నశ్రీ తదితరులు ఉన్నారు.

స్మార్ట్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ ప్రాంతంలో ఆదివారం వామపక్షాల నాయకులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. వారం రోజులుగా వామపక్షాల నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా విద్యుత్ సంస్థ కార్యాలయాలు, సబ్ స్టేషన్‌ల వద్ద బారీ ఎత్తున నిరసన కార్యక్రమాలనే చేపడుతున్నట్లు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు జోగి శివకుమార్, వెంకటరామిరెడ్డి, సీహెచ్ ప్రభాకర్, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్, పామంజి మణి, ఎం



సంతకాలు సేకరిస్తున్న వామపక్షాల నాయకులు

బేటి చంద్రయ్య, సుబ్బయ్య, భాస్కరరెడ్డి, గండి కోట మధు, చంద్రయ్య, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ పాల్గొన్నారు.

కండలేరులో 25.917 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 25.917 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5280 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1700, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటిబ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గంగమ్మ కొలుపు

సైదాపురం : మండలంలోని ఓరుపల్లి గ్రామంలో గ్రామ దేవత గంగమ్మ తల్లికి కొలుపు అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే ఈ కొలుపునకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొలుపు సందర్భంగా చివరిరోజు ఆదివారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెట్ల మధ్య గ్రామస్తులంతా కలిసి కట్టుగా బయలుదేరి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం సమీపంలో పొంగళ్లుపెట్టారు. అనంతరం ప్రత్యేకంగా ముగ్గు వేశారు. గంగ పెట్టెను ఊరేగించారు. వీరతాళ్లతో ప్రదర్శన చేశారు.



అమ్మవారికి సమర్పించేందుకు పొంగళ్లతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నేరాల కట్టడికి డ్రోన్ నిఘా

వెంకటగిరి రూరల్: సర్కిల్ పరిధిలోని అవాంఛనీయ, అసాంఘిక కార్యక్రమాల కట్టడికి డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచనున్నట్లు సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీ, టిడ్కో గృహాల పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి సర్కిల్ పరిధిలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో నేరాలను నియంత్రించే దిశగా తిరుపతి ఎస్పీ డ్రోన్ కెమెరాను పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా నేరాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

సమాజంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఐ ఏవీ రమణ సూచించారు. పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద మార్పు సంస్థ అధ్యక్షులు చిరుగుపాటి పవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో సీఐ ఏవీ రమణ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్పు సంస్థ సభ్యులు కిషోర్‌కుమార్, జోసఫ్, అజిత, చిరిగుపాటి లావణ్య, పల్లిపాటి వెంటేష్, విజయ్‌కుమార్, వానెమ్మ, రామకృష్ణయ్య, ప్రశాంత్, టిడ్కో గృహాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

గూడూరురూరల్ : పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ తరఫున ఆదివారం ఇంజినీరింగ్ చదువుతున్న వాకాడు మండలానికి చెందిన పనబాక శ్రీనాథ్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ధనుంజయ రెడ్డి, సెక్రటరీ జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రభాకర్, విశ్రాంత ఎస్‌ఐ. ప్రభాకర్, డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



యంత్రాలతో మట్టి తవ్వుతున్న దృశ్యం

చిల్లకూరు : గూడూరు మండలం గోగినేనిపురం చెరువులో ఆదివారం సెలవు దినం కావడంతో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తమ ఇష్టానుసారంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాయకులు ఎవరికి వారు ఎక్కడ పడితే అక్కడ మట్టి, గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అధికారులు అడిగితే పై నుంచి ఒత్తిడి చేయించి మిన్నకుండి పోయేలా చేస్తున్నారు. దీంతో ఎక్కడ మట్టి, గ్రావెల్ కనిపిస్తే అక్కడ భూమిని గుల్లగుల్ల చేస్తూ తమకు ఇష్టం వచ్చినట్లు పబ్బం గడుపుకుంటున్నారు. ఈ క్రమంలోనే గూడూరు మండలం గోగినేని పురం చెరువులో ఇటీవల కొంత మందికి మట్టిని తవ్వుకునేందుకు అనమతులు ఇచ్చారు. అయితే దానికి కాలపరిమితి తీరిపోయినా దానిని సాకుగా చూపుతూ యంత్రాల సాయంతో మట్టి తవ్వకాలను చేపట్టి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. దీని ఇరిగేషన్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

చెంగాళమ్మకు పొంగళ్లు



పుష్పాలంకరణలో చెంగాళమ్మ, అమ్మవారి ముగ్గు

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో జరుగుతున్న చెంగాళమ్మ తొమ్మిదో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఉదయం అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మ వారికి ప్రత్యేక పుష్పాలంకరణ గావించారు. అమ్మ వారి ప్రతిమను రంగవల్లులతో తీర్చి దిద్దారు. గంగ పెట్టె ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి గ్రామోత్సవం చేశారు.

వైభవంగా వెంకయ్య స్వామి ఆరాధన

సైదాపురం: మండల కేంద్రంలోని వెంకయ్య స్వామి ఆలయంలో ఆదివారం ఏటా జరిగే ఈ ఆరాధన అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీ భగవాన్ వెంకయ్యస్వామినిదర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. స్వామి వారికి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ప్రత్యే క అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

15 నుంచి రాపూరమ్మ జాతర

రాపూరు: మండల కేంద్రంలోని గ్రామ దేవత రాపూరమ్మ జాతర ఈ నెల 15 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాచీన కాలంనాటి ఈ ఆలయంలో అమ్మవారి జాతర నిర్వహిస్తున్నారు. 15వ తేదీ ఉదయం అభిషేకం, అంకురార్పణ, అమ్మవారి ఆహ్వానం, 16వ తేదీ పూలంగిసేవ, అన్నదానం, గంగపెట్టి ఊరేగింపు, 17న గ్రామ పొంగళ్లు, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేడుకగా మహా కుంభాభిషేకం

కోట: మండలంలోని కేసవరంలో నూతనంగా నిర్మించిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం రెండవ రోజు గోపూజ, దీక్షా హోమం, కలశస్థాపన, నివేదన, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి అమ్మవార్ల విగ్రహాలు, కలశాల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా హైవే క్రాస్‌రోడ్లు



రాజుపాళెం దుకాణాల వద్ద రహదారిపై పార్క్ చేసిన లారీలు



ప్రమాదకరంగా మారిన పెదపరియ క్రాస్ రోడ్డు

ఓజిలి: స్థానిక జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. రహదారికి ఇరువైపులా మూడు క్రాసింగ్ పాయింట్లు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అతివేగం ఒక కారణమైతే చీకటి మరో కారణంగా కనిపిస్తుంది. ఇటీవల పెదపరియ క్రాస్ రోడ్డు వద్ద మలుపులో కారు ఢీకొని ఇద్దరు మత్యువాత పడ్డారు. రాజుపాళెం రహదారి మలుపు వద్ద అస్సాం రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తి తెల్లవారు జామున రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందాడు. పెదపరియ క్రాస్ రోడ్డు వద్ద గతేడాది రోడ్డు దాటుతుండగా ట్రాన్స్‌కో లైన్‌మన్‌ను కారు ఢీకొనడంతో చనిపోయాడు. రాచపాళెం క్రాస్ రోడ్డు వద్ద దగదర్తి మండలానికి చెందిన ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొనడంతో మత్యువాత పడ్డారు. ఈ ఏడాది గత నెలలో సన్‌సిటీ సమీపంలో కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. గత నాలుగేళ్లలో సుమారుగా 100 మంది వరకు వివిధ ప్రమాదాలతో మృతి చెందారు. రోడ్డు క్రాసింగ్ పాయింట్ల వద్ద ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసిన ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.